
సంవత్సరానికి, రెండు సంవత్సరాలకూ శ్రీవారికి ట్రాన్స్‌ఫర్ కావటం వలన ఒకచోట కుదురుగావుండి పరిసరాలను ఆకళింపుచేసుకోవటానికికాని, నలుగురితో స్నేహం పెంచుకోవటానికికాని వీల్లేకుండాపోయింది. కొత్తచోటికి వెళ్ళినపుడల్లా మళ్ళీ మళ్ళీ పాలవాళ్ళూ, చాకలీ, పనిమనిషి అందరినీ కొత్తవాళ్ళను కదుర్చుకోవటం, మా పద్ధతులు వాళ్ళకూ, వాళ్ళ పద్ధతులు మాకూ ఆకళింపు అయ్యేవరకూ కిందా మీదా పడటం అలవాటైపోయింది. అందులోనూ పనిమనిషిది చాలా గడ్డుసమస్య. ట్రాన్స్‌ఫర్ అయినపుడల్లా కొత్తచోట పని



# చిగిర్చిన వసంతం

వాసిరెడ్డి కాశీరత్నం

వాళ్ళతో గొడవపడ్డాం. పనికి ఒకపూటవస్తే ఒకపూట రాకపోవటం, ముందే అడ్వాన్సుగా జీతాలివ్వటం, చీరెలు, సారెలూ సమర్పించటం ఇంతచేసినా వాళ్ళు స్పూనులూ గిన్నెలూ ఒక్కొక్కసారి దొరికితే బంగారం కూడా ఎత్తుకపోయే వాళ్లు.

బొంబాయిలోనూ, ఢిల్లీలోనూ పని వాళ్ళు చేసిన అఘాయిత్యాలు వింటుంటే వొళ్ళు జలదరించేది.

"అసలు పనిమనిషెందుకు? రష్యా, అమెరికా ఇంగ్లాండు లాంటి దేశాలలో పనిమనుషు లుండరు. ఎవరి పనులు వాళ్లు చేసుకోవాలి. ఇది ప్రజాస్వామ్య యుగం, ఒకరికొకరు వెట్టి చాకిరీ చేయ రాదు."

అనర్గళంగా మావారు ఇంట్లో వుపన్యాసం దంచేవారు, నాకు చాలా చిరాగ్గా వుండేది.

"అవునూ, అవన్నీ అభివృద్ధి చెందిన దేశాలు. ఆడా, మగా కలిసి పని చేసుకుంటారు, అంట్లు తోమటానికికూడా మిషనులుంటాయి. ఇంతమట్టి, చింత పండూ వేసి తోమి వంచి వార్చేసరికి నడుం, విరిగిపోతుంది, చేసేవాళ్ళకుతెలుస్తుంది బాధ!

సరి. నేనూ వుపన్యాసం ఇచ్చేశాను. ఈ గొడవ కేంగానీ మళ్ళీ కొత్తచోట మా పాట్లు మొదలయ్యాయి. ఈసారి ఎలాగో చాకలిని పట్టుకున్నాం. కాని పనిమనిషి, పాలవాడూ దొరకలేదు. ఆ ఇద్దరినీ చూసే బాధ్యత చాకలి వాడికి అప్పగించాలి

అసలు ఆ రోజు అక్కడ దిగేటప్పటికి సాయంత్రం నాలుగయింది. మంచాలు కుర్చీలూ గోతాలలో కట్టి వున్నాయి. వంటసామానులున్న పాకేజ్ పెట్టెలకు మేకులు బిగించివున్నాయి. సామాన్లు అక్కడక్కడ పడేయుంచి మా శ్రీవారు తన పై ఆఫీసర్ని కలుసుకోవటానికి వెళ్ళారు, ఆ ఊళ్ళో ఏదైనా హోటలులో భోజనం దొరుకుతుందని కూడా నమ్మకంలేదు. సామాన్లు పెటుక్కని అన్నీ విప్పివంట చేయటం తప్ప మరో మార్గంలేదు. ఏ పెట్టెలో ఏమి సామాన్లున్నాయో కూడా సరిగా గుర్తు లేదు, ఆ సామాన్లు ఎలా విప్పాలో అదంతా తల్చుకుంటే నాకు వొళ్ళంతా నీరసం వచ్చేసింది. అక్కడ కూలబడి కనీసం ఒక్కటైనా విప్పుదామని ప్రయత్నం చేస్తున్నాను, ఇంతలో బయటి నుండి అమ్మగారూ అని వినిపించింది. నేను వులిక్కిపడి లేచాను, ఆ స్వరం ఎక్కడో విన్నట్లేవున్నది. నేను బయటికివచ్చి చూద్దునుకదా నా కళ్ళను నేను నమ్మలేకపోయాను,

"అమ్మా, నేను బాలుచ్చినమ్మా."

అది అలా వచ్చి నా కళ్ళముందు నిలబడితే నా కళ్ళను నేను నమ్మలేక పోయాను. చచ్చిపోయిందనుకున్న

బాబుచ్చిమళ్ళీ ఎలా వచ్చింది?

"అయితే బాబుచ్చీనువ్వు..." నాకు మరి మాటలు రాలేదు. అదే చెప్పింది.

"నాను చచ్చిపోనే దమ్మగారూ. నెల రోజులు హాస్పటల్‌లో వుండిపోనాను. మొండిదాన్నమ్మా."

నా ఆశ్చర్యానికి హద్దులేదు. బ్రతక దనుకున్న బాబుచ్చి బ్రతకటం, ఆపైన మళ్ళీ నా కిక్కడ తటస్థపడటం. చాలా చిత్రంగా వుంది. అదే కాదు. బాబుచ్చి చాలా హుషారుగా, తేటగావుంది. చక చకా మాట్లాడుతున్నది. అదెంతో మారి పోయింది.

దాన్ని ప్రశ్న లడగటానికి నాకు టైములేదు. ముందు దాన్ని లోపలికి పిలిచి మేకులు వూడ లాగటానికి సాయం చెయ్యమన్నాను. అది పటకారు పుచ్చుకుని నిమిషంలో చెక్కలు వూడ లాగేసింది. రెండు గిన్నెలు బయటికి లాగి ముందు కాఫీ పెట్టుకోమన్నది తక్కిన పనంతా తనే చేస్తానన్నది, అది అలా చక చకా పనిచేస్తుంటే నేను చూస్తూ కూర్చున్నాను. అలా చూస్తూ వుంటే నాకు ౬. ౭ సంవత్సరాల నాటి మాట గుర్తుకొచ్చింది, మాకు అప్పుడే చింతపల్లి టాన్స్‌ఫర్ అయింది. విశాఖపట్నానికి డెబ్బై మైళ్ళదూరంలో పులులూ, సివంగులూ తిరిగే అడివి ప్రాంతం. సినిమాలో అయితే సరదాగా చూడవచ్చు. నిజంగా అడివే అయినా ఒకసారి చూసి సంతోషించవచ్చు. కాని అడివిలోనే కాపురం వుండా లంటే మాటలు కాదు.

ఒక్కొక్కసారి ఇంటి ముందుగా జనం హడావుడిగా పరిగెత్తే వాళ్ళు. ఏమిటని అడిగితే పులి ఇటే తిరుగుతున్నదని చెప్పేవాళ్లు. గుండెల్లో వణుకు పుట్టు కొచ్చేది, తలుపులు బిడాయించుకుని కూర్చునే వాళ్ళం. బాత్‌రూమ్‌లోకి వెళ్ళాలన్నా భయమే. అలాంటపుడు బాబుచ్చి తప్ప నాకు మరొకళ్ళు తోడు వుండేవాళ్ళు కాదు. బాబుచ్చి మౌనంగా తనపని చేసుకుపోయేది. ఎవరితోనూ మాట్లాడేది కాదు. దాని మొహంలో ఏదో కోపం, విషాదం గూడు కట్టుకుని వుండేవి. అసలు దాని పేరే గమ్మత్తుగా వుండేది. నీ పేరేమిటే అలా వుందంటే పెదవులు విప్పకుండా నవ్వేది. చిన్నప్పుడు దాని తండ్రి ఆ పేరుతో పిలిస్తే అదే పేరు స్థిర పడిందట. అసలు పెద్దగా నవ్వటం నేనెప్పుడూ చూడలేదు.

పనిచేసి టైముకు వెళ్ళిపోయేది. ఆ వూళ్ళో నాకు స్నేహితులు దొరకలేదు. సరి కదా బొత్తిగా నోరు తెరవని పని మనిషి దొరికిందని చీకాకుగా వున్నది. మాట్లాడకపోయినా పని మాత్రం చక్కగా చేసేది.

అడవి ప్రాంతంలో పనివాళ్ళేవరూ దొంగతనాలు చెయ్యరు. నాగరికలోకం

వుండే చెడువాళ్లదాకా రాలేదు. ఏదైనా వస్తువు పోతుందనే భయం నాకుండేది కాదు.

ఒకరోజు, నాకు బాగా జ్ఞాపకం. అడవిలో వున్న మా యింటికికూడా అతిధులు వచ్చారు. ఆ చుట్టుపక్కల వున్న పులిని వేటాడటానికి వచ్చారు వాళ్ళు. వాళ్ళంతా తుపాకులు, మాటుకు కావలసిన సామగ్రి తప్పెటలు,దీపాలు అన్నీ పుచ్చుకుని సిద్ధమౌతున్నారు. వాళ్ళకు భోజనాలు అమర్చటం నా వంతయింది. కుందేళ్ళు, అడవి పక్షులు, నెమలి మాంసం అన్నీ వున్నాయి.వాటన్నింటికీ మసాలాలు తయారు చేయాల్సిన పని బాబుచ్చిది. నేను బాబుచ్చికోసం ఎదురు చూస్తున్నాను. సాధారణంగా అది క్రమం తప్పకుండా వచ్చేది. ఆ వేళ ఎందుకో అవిరాలేదు. నేను ఎదురు చూస్తుండగానే దాన్ని పిలవటానికి వెళ్ళిన జవాను నరసయ్య భయంతో వణికిపోతూ దిక్కు తెలియకుండా పరిగెత్తుకు వచ్చాడు. వాడు నోరు విప్పి మాట కూడా చెప్పలేకపోతున్నాడు. గుమ్మం దగ్గరే కూలబడి పోయాడు. ఏమిటేమిటని ఇంట్లో అందరం వాడి దగ్గరకు పరిగెత్తాం.

"ఓలమ్మో ఏటి? పొడిసేసినాడు, సచ్చిపోనాదయ్యో. ఇంకేటి బతుకు కాదమ్మో? ఓరమ్మో గోరకలి, బాబయ్యో. గోరకలి అయిపోనాది. ఇలాగ పొట్టలో పొడిసేసినాడు."

"ఏవిట్రా?" ఏవయింది? తరువాత ఏడుద్దువు గాని. సంగతేవిటా ముందు చెప్పు.

వాడు ఏడుస్తూ, భయపడుతూ సగం అడవి భాషలో చెప్పిన మాటల సారాంశం ఇది. నరసయ్య వెళ్ళేసరికి బాబుచ్చి ఇంట్లో అంతా పోట్లాడుకుంటున్నారట. ఈ తగువు చాలా రోజుల నుండే వున్నదట. తన తమ్ముడితో భార్యకు సంబంధం వున్నదేమోనని అతనికి అనుమానమట. చాలాసార్లు దాన్ని తిట్టడం కొట్టడం జరిగింది ఆ రోజు కోట్లాట పెద్దదయింది బాబుచ్చి మొగుడు దానిని పొట్టలో కత్తిపెట్టి పొడిచాడట. అది కిందపడిపోగా రక్తం మడుగయిందట. వాడు కూడా పొడుచుకోబోతుంటే ఇంకా తెలివిగా వున్న బాబుచ్చి పొడుచుకోకుండా వాణ్ణి ఆపిందట.

అందరం బాబుచ్చి ఇంటికి పరుగెత్తాం. అప్పటికే బాబుచ్చి మొగుడు పారిపోయాడు. అది తెలివిలేకుండా రక్తపుమడుగులో పడివున్నది. దాన్ని జీపులో వేసుకుని హాస్పటల్‌కి తీసుకెళ్ళాం. బ్రతుకుతుందని మాకువిమాత్రం నమ్మకంలేదు. అయినా వూపిరి ఇంకా కొట్టుకుంటున్నది కనుక తీసుకెళ్ళాం.

హాస్పటల్‌లో దాని దగ్గరే కూర్చున్నాను. ఆ రాత్రి దానికి ఆపరేషన్

చేశారు రెండుమూడురోజులు గడిచినా దానికింకా పూర్తిగా తెలివి రాలేదు. డాక్టర్లు బ్రతికేదీ లేనిదీ ఖచ్చితంగా చెప్పలేమన్నారు.

ఈలోపల మాకు ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు వచ్చాయి. బాబుచ్చికి పూర్తిగా తెలివి వచ్చేవరకు అక్కడే వుండాలనివున్నా. కాని ఆ అడవి ప్రాంతంలో నేనొక్కదాన్నీ వుండే పరిస్థితి లేదు. బ్రతికి బయటపడితే బాబుచ్చి అవసరానికి వుంటుందని కొంత డబ్బు నరసయ్యకు ఇచ్చివచ్చాము.

అంతే. ఆ తరువాత బాబుచ్చి ఏమయిందో మాకు తెలియదు. ఆ తరువాత మళ్ళీ ఇప్పుడే కనిపించటం,

అది చాలా హుషారుగావుందిప్పుడు అసలే కను ముక్కు తీరుకలది. నిగారింపుగా వచ్చి ముచ్చటగా కనిపిస్తున్నది అది కూడా కాఫీ తాగిం తరువాత వెనుకటి విషయాలన్నీ చెప్పింది.

అది హాస్పిటల్‌లో నెలరోజులు పడివున్నదట. డాక్టర్లు బ్రదకదని చెప్పినా అది బ్రతికింది. దాని మొగుణ్ణి పోలీసులు ఎలాగో పట్టుకుని జైల్లో పెట్టారట బాబుచ్చి కోర్టులో వాఙ్మూలం ఇవ్వవలసి వచ్చింది.

"మా మరిదితో నాకు జత కుదిరినాదని సెప్పమని మా సుట్టాలంతా బతిమాలినారు. అలాగే సెప్పినాను. ఏటి సేయను?"

"బాబుచ్చీ అయితే నీకు నిజంగా మీ మరిదితో సంబంధం ఏర్పడిందా?" నేను ఆశ్చర్యంతో తల మునకలయినాను.

బాబుచ్చి విషాదంగా తలవూపింది.

"లేదమ్మా, మరిదితో నాకేటి జత అన్నత్రిలో వాడొచ్చి కాళ్ళమీద పడిపోతాడు. నిన్నింకేటి సెయ్యను. ఈసారికి నువ్వు కోర్టులో అలాగ సెప్పేస్తే పోలీసు లొగ్గేస్తారన్నాడు. సరేనని సెప్పినాను. కాని సిగ్గుతో సచ్చిపోనా నమ్మగారూ కోర్టులో అలాగ సెప్పినాక మరింక ఆడి మొకం సూడలేదు. ఆ ఊర్లో వుండలేదు. మీరిచ్చిన డబ్బు నరసయ్య నాకిచ్చినాడు. అదట్టుకుని మా పుట్టింటికి నరసీపట్నం ఎచ్చేసినాను మరి గంతే. నాను మారుమనువు కట్టుకున్నాను. ఈడు శానా మంచోడమ్మా. నన్నొక మాటనడు పువ్వులాగ సూసుకుంటాడు. ఇద్దరం ఈడే బతుకుతున్నాం. మాకో బొట్టె వున్నాడమ్మా. రేపట్టుకొస్తాను సూద్దురుగాని."

బాబుచ్చిని నేను సంతోషంగా, ఆశ్చర్యంగా చూశాను. అది చాలా ఎదిగిపోయింది. ఎంత గొప్పమనసు? మొగుడు బతిమాలితే జాలివేసి వాడిని జైలునుంచి విడిపించింది. కాని వాడికి లొంగిపోకుండా ధైర్యంగా వచ్చేసింది. క్రింది తరగతి స్త్రీలకుండే ఈ ధైర్యం. సాహసాలుపై తరగతిస్త్రీలకుండటంలేదు సంఘం అనే బూచిచూసి వాళ్ళు భయపడుతున్నారు.

బాబుచ్చి మళ్ళీ మా ఇంట్లో పని చేస్తున్నది. కాని ఈసారి హుషారుగా తిరుగుతూ హాయిగా నవ్వుతూ,మా ఇల్లు కళకళ లాడిస్తున్నది.